క్లుప్తంగా

రోడ్డుకు మరమ్మతులు చేయండి


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్ గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయమైందని, వెంటనే మరమ్మతులు చేయించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా నాగప్ప మాట్లాడుతూ.. పట్టణంలోని శేష్‌ప్రభ థియేటర్ నుంచి గౌతపూర్ వరకు రోడ్డు గుంతలమయంగా ఉందన్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, అనిల్, జగదీష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు తోడ్పాటునందిస్తాం

లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్


వాటర్ డిస్పెన్సర్‌ను అందజేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, సభ్యులు

తాండూరు టౌన్: ప్రభుత్వ గురుకులాలు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం లయన్స్ క్లబ్ అన్ని విధాలా తోడ్పాటునందిస్తుందని క్లబ్ తాండూరు అధ్యక్షుడు రొంపల్లి సంతోష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణ శివారులోని గురుకుల పాఠశాలకు లయన్ గౌరీ శంకర్ సహకారంతో కూల్ అండ్ హాట్ వాటర్ డిస్పెన్సర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏటా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేయడంతో పాటు వారికి కావాల్సిన కనీస వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, క్లబ్ జోన్ చైర్మన్ బసనప్ప, కార్యదర్శి వీరప్రసాద్, కోశాధికారి అసద్ అలీ, సభ్యులు గౌరీ శంకర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ రంగంలో మహిళలు రాణించాలి


మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ సంజీవులు

కొడంగల్ రూరల్: టెక్నాలజీ రంగంలో మహిళలు పురోగతి సాధించాలని ప్రిన్సిపాల్ రఫియాఖానమ్ అన్నారు. మంగళవారం పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ అండ్ ఏఐ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎట్ ఎడ్యుకేషన్, డెల్ టెక్నాలజీ సహకారంతో విద్యార్థినులకు అయిదు రోజులపాటు రిసోర్స్ పర్సన్ ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆవశ్యకతను, ఎంఎస్ ఎక్సెల్, పవర్ బీఐ తదితర అంశాలపై శిక్షణను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో మేలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్ సంజీవులు, వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపక సిబ్బంది హరిప్రియ, స్వప్న, స్వరూప, స్వాతి విద్యార్థినులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరును తొలగించొద్దు

తాండూరు రూరల్: హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును తొలగించొద్దని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శేఖపురం ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కేవలం పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్యులు కావడంతో పేరును తొలగిస్తున్నారన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాపరెడ్డి పేరుగా మార్చడంపై పునరాలోచించాలని విన్నవించారు. ఆంధ్రరాష్ట్రాన్ని సాధించి తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు.

హెచ్‌సీయూకు విద్యార్థిని ఎంపిక

కేశంపేట: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ ఎలిజిబులిటీ పరీక్షలో మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన మాధపురం నందిని అర్హత సాధించింది. ఆమె పదోతరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్మీడియట్ కొత్తపేటలోని ప్రభుత్వ కాలేజీలో చదివినట్లు గ్రామస్తులు తెలిపారు. హెచ్‌సీయూకి ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు, కాలేజీ అధ్యాపకులు, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

పేర్లు లేక.. రేషన్ అందక


సంగాయిపల్లిలో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

- కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు
- నూతన కార్డు నమోదు ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని వినతులు

దుద్యాల్: సంవత్సరాలుగా రేషన్ కార్డులలో మార్పులు చేర్పుల ప్రక్రియ జరగకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొత్తగా పెళ్లైన, సంతానం కలిగిన వారి వివరాలను నేటికీ రేషన్ కార్డులలో నమోదు చేసుకోక అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందని వారి సంఖ్య సైతం గణనీయంగా తగ్గింది. గతంలో ఉన్న కుటుంబ సభ్యుల పేర్లు మాత్రమే రేషన్ కార్డులలో ఉండడం.. అనంతరం సదరు కుటుంబంలోకి పెళ్లైన, జన్మించిన వారి వివరాల నమోదుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వకపోవడం ప్రజలు నిరాశ చెందారు. ఎవరైన మరణిస్తే వారి పేరును తొలగించినంత త్వరగా కొత్త వారి పేర్లను నమోదు చేయకపోవడం విడ్డూరంగా ఉందని గత ప్రభుత్వంపై వ్యతిరేక వినిపించాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డు నమోదు ప్రక్రియ త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల కొత్త పేర్ల నమోదు, నూతన రేషన్ కార్డు కోసం విడివిడిగా దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో దరఖాస్తు ప్రక్రియ తొందరగా ప్రారంభించాలని గ్రామీణ ప్రాంత వాసులు కోరుతున్నారు.

> **ఏడేళ్ల నుంచి వెతలు**
>
> 
>
> పెళ్లైన ఏడేళ్లు గడుస్తున్నా రేషన్ కార్డులో పేరు నమోదుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదు. మా కుటుంబ సభ్యులతో పాటుగా పేరు నమోదు చేయాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అలసిపోయా. అప్పటినుంచి రేషన్ సరుకులు అందలేదు. గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ నమోదు ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి.
>
> – మానస, గృహిణి, హస్నాబాద్

మురుగును భరించలేం!

దుద్యాల్: మురుగు సమస్యతో మండలంలోని హస్నాబాద్‌వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్థానికంగా ఉన్న మత్స్యకార భవనం వద్ద, ఇళ్ల మధ్య మురుగు నిల్వడంతో దుర్గంధం వ్యాపిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువల నుంచి కొట్టుకొచ్చిన మురుగు, చెత్త చెదారం నిండుకుపోవడంతో వారం రోజులుగా దుర్వాసన వస్తుంది. దీంతో ఇళ్లల్లో సైతం ఉండలేకపోతున్నమని ఆయా కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్య పేరుకుపోయిన మురుగు, చెత్త నిల్వల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డు పక్కనే పేరుకుపోయిన వ్యర్థాలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


కొడంగల్ రూరల్: సబ్సిడీ పత్రాలు అందజేస్తున్న వార్డు కౌన్సిలర్


తాండూరు టౌన్: 14వ వార్డులో సబ్సిడీ పత్రాలను లబ్ధిదారులకు ఇస్తున్న కౌన్సిలర్

గ్యాస్ సబ్సిడీ పత్రాల అందజేత

తాండూరు టౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని 14వ వార్డు కౌన్సిలర్ బాంబిన అన్నారు. మంగళవారం తన వార్డు పరిధిలో పలువురికి గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోరే ఏకైక ప్రభుత్వమే కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో ఆర్పీ కల్యాణి, కార్తీక్, ఫాతిమా, శివలీల తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 8వ వార్డులోని రాజీవ్‌కాలనీలో కౌన్సిలర్ వెంకన్నగౌడ్ ఆధ్వర్యంలో గ్యాస్ సబ్సిడీ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఉమేష్ కుమార్, మున్సిపల్ జవాన్ అశోక్, కాంగ్రెస్ నాయకులు జిలాని, వాజిద్, ఇనాయత్, నాసర్, ఎలమంద తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్ రూరల్: పట్టణంలోని రెండో వార్డు 4వ రేషన్‌షాపు దగ్గర గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పత్రాలను వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్ లబ్ధిదారులకు అందజేశారు. అర్హులందరికీ గ్యాస్ సబ్సిడీని అందజేయాలని ఆయన పేర్కొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ మురళీధర్, కార్యదర్శి భాస్కర్‌ల ఆధ్వర్యంలో గ్యాస్ సబ్సిడీదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనందం, నాయకులు గోపాల్ నాయక్, వెంకటేష్, కృష్ణయ్య, కృష్ణయ్య, భాను తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పెద్దేముల్: ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని గోట్లపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ తాండూరు ఏ-బ్లాక్ అధ్యక్షుడు లోంక నర్సింలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ మహవీర్ ఆస్పత్రి సహకారంతో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ క్యాంపులో జనరల్ సర్జర్, అర్థోపెడిక్, చర్మవ్యాధి తదితర నిపుణులు రానున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బొంరాస్‌పేట ఎంఈఓగా హరిలాల్

బొంరాస్‌పేట: రాష్ట్ర గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల ప్రధాన కార్యదర్శిగా ఉన్న స్థానిక జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం హరిలాల్‌ను ఎంఈఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొన్నేళ్లుగా ఇన్‌చార్జి ఎంఈఓ కొనసాగడంతో నోడల్ అధికారిగా ఉన్న హరిలాల్‌ను నియమిస్తూ మంగళవారం విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పాఠశాలల్లో పనుల పరిశీలన

బంట్వారం: మండల పరిధిలోని తొర్మామిడి, బొప్పునారం, బస్వాపూర్, మద్వాపూర్ గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పలు అభివృద్ధి పనులను ఎంపీడీఓ రాములు మంగళవారం పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల్లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ సుధాకర్, ఈసీ శ్రీనివాస్, టీఏ జంగయ్య తదితరులు ఉన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

షాద్‌నగర్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ సర్పంచ్ సుమన అన్నారు. మండల పరిధిలోని విత్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతేడాది పదోతరగతి పరీక్షా ఫలితాల్లో తెలుగు, హిందీ సబ్జెక్టుల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకుగాను ఉపాధ్యాయులను ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బూర్గుల గ్రామంలో ఉన్న ప్రగతి వెల్ఫేర్ సొసైటీలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ సర్పంచ్ సుమన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఆవుల రవి, తెలుగు, హిందీ ఉపాధ్యాయులు మల్లేశ్, రవికాంత్‌ను సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించడంతో పాటుగా మెమెంటోలను అందజేశారు. వచ్చే పదో తరగతి వార్షిక ఫలితాల్లో పది జీపీఏ సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదువేల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు హెచ్ఎం తెలిపారు.

పరిశుభ్రత అందరి బాధ్యత


విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కౌన్సిలర్, కమిషనర్

తాండూరు టౌన్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా స్వీకరించాలని మున్సిపల్ 28వ వార్డు కౌన్సిలర్ విజయాదేవి అన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సింధు బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హి సేవా అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంట్లోని చెత్త చెదారాన్ని రోడ్డుపై వేయకుండా, మున్సిపల్ వాహనానికి అందజేయాలన్నారు. అనంతరం విద్యార్థినుల చేత స్వచ్ఛతా హి సేవా ప్రతిజ్ఞను చేయించారు.

చాకలి ఐలమ్మ యువతకు ఆదర్శం


పాఠశాలలో ఉపాధ్యాయులతో స్థానిక నాయకులు

కుల్కచర్ల: పేద ప్రజల అభ్యున్నతికి పోరాడిన ప్రతిఒక్కరిని సమాజం గుర్తుంచుకుంటుందని పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ అధ్యక్షుడు ఎల్పాటి అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం చౌడాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చాకలి ఐలమ్మ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమికోసం, భుక్తికోసం పేద ప్రజల తరపున పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మను నేటి యువతులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వ్యాసరచన పోటీలో ప్రతిభచాటిన విద్యార్థులకు ఈనెల 26న చాకలి ఐలమ్మ జయంతి పురస్కరించుకుని బహుమతి ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉమాపతిరెడ్డి, నాయకులు వెంకటేష్, యాదయ్య, కృష్ణయ్య, యాదయ్య, రాములు, మణికంఠ, బాల్‌రాజ్, అలివేలు, గోపాల్, సలీం, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఎంఈఓ రాంరెడ్డి

కొడంగల్ రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడంతో మంచి భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) పోటీల్లో గెలుపొందిన వివిధ జట్ల విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, విద్యార్థులు క్రమశిక్షణతో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థానాల్లో నిలిచేందుకు కృషిచేయాలని సూచించారు. చదువుతోనే సమాజంలో గౌరవం దక్కుతుందని అన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో విద్యార్థులకు విన్నర్, రన్నర్ బహుమతులతోపాటు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మురళీధర్, వ్యాయామ ఉపాధ్యాయులు అజీజ్, అనిల్‌కుమార్‌లతోపాటు ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన మహా పాదయాత్ర

బంట్వారం: మండల పరిధిలోని తొర్మామిడికి చెందిన వీరేశం తన మిత్ర బృందంతో కలిసి పాదయాత్రగా కాశీ, అయోధ్యకు వెళ్లారు. మంగళవారం అక్కడి నుంచి ఫోన్‌లో మాట్లాడుతూ.. గత నెల 18న హైదరాబాద్ నుంచి రాజశేఖర్ గురుస్వామి ఆధ్వర్యంలో కాశీ, అయోధ్య మహా పాదయాత్ర చేసినట్లు చెప్పారు. 37 రోజుల పాటు సాగిన మహా పాదయాత్ర మంగళవారం సంపూర్ణమైందని తెలిపారు. ఇందులో రాజశేఖర్ గురుస్వామి, లింగుస్వామి, జ్యోతిస్వామి, మురళిస్వామి ఉన్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి


ర్యాలీ తీస్తున్న హిందూ సంఘాలు

తాండూరు టౌన్: తిరుపతి లడ్డూ కల్తీ అయ్యిందనే ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, దోషులెవరో తేల్చాలని పలు హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. భద్రేశ్వర్ చౌక్ నుంచి ఇందిరాచౌక్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. స్వామి వారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారనే అంశంపై నిజానిజాలను తేల్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, తెలంగాణ సాధు పరిషత్, గీతా సత్సంగ్ సమితి, హిందూ వాహిని సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఫౌండేషన్‌కు విరాళం అందజేత


ఫౌండేషన్ కో ఆర్డినేటర్‌కు విరాళాన్ని అందిస్తున్న పాఠశాల సిబ్బంది

కొడంగల్ రూరల్: పట్టణంలోని నవీన ఆదర్శ ప్లే హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది, యాజమాన్యం మంగళవారం హైదరాబాద్‌లోని సోచ్ దివ్యాంగుల ఫౌండేషన్‌కు విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఫౌండేషన్ కో ఆర్డినేటర్‌కు రూ.23వేలు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్‌రాజ్, ఫౌండర్ వెంకటయ్య, వైస్ ప్రిన్సిపాల్ సంతోష విరాళాలు సేకరించిన విద్యార్థులకు మెమెంటోలు, మెడల్స్ అందిస్తూ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం అరుణ, సంగీత, అరుణజ్యోతి, నాజియా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన


అమ్మాపూర్‌లో కురుస్తున్న వర్షం

మొయినాబాద్‌రూరల్: మబ్బుపడిన ఆకాశం.. రోజంతా మబ్బులతో ఉండి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మేఘాలతో మబ్బులుపడిన ఆకాశం సాయంత్రం వేళ రెండు గంటలపాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో వాహనాదారులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారు. పంటపొలాల్లో భారీగా వర్షపునీరు చేరింది. గత 15 రోజుల నుంచి అడపదడపా కురుస్తున్న వర్షాలతో పాటు మంగళవారం ఒక్కసారి మళ్లీ భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.

చదువుతోనే ఉన్నత స్థితి

ఎంపీడీఓ మహేశ్‌బాబు

దోమ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఎంపీడీఓ మహేశ్ బాబు సూచించారు. దోమ మండల పరిధిలోని కిష్టాపూర్ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠ్యాంశాలను శ్రద్ధగా విని మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరాలంటే చదువు అత్యంత ప్రధానమైనదని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే కష్టపడి చదవాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత, మెనూ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సీడీపీఓ కాంతారావు

తాండూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల శారీరక ఎదుగుదలపై టీచర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని తాండూరు ఐసీడీస్ ప్రాజెక్టు సీడీపీఓ కాంతారావు సూచించారు. మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ కాంతారావు మాట్లా డుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు విలువైన పోషకాహారం అందించాలన్నారు. చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేలా గట్టి పునాదులు వేయాలని టీచర్లను ఆదేశించారు. తక్కువ బరువు ఉన్న చిన్నారులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నిర్మళ, సుశీల, సునీత, మీనాక్షి, జ్యోతి, రాణీ తదితరులు పాల్గొన్నారు.


తాండూరు రూరల్: మాట్లాడుతున్న సీడీపీఓ కాంతారావు


బంట్వారం: ఆహార ప్రదర్శనను తిలకిస్తున్న సీడీపీఓ ప్రవీణ తదితరులు

పౌష్టికాహారం తప్పనిసరి

బంట్వారం: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ ప్రవీణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. ఆరోగ్యకరమైన జీవితానికి పోషకాహారం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ రాములు, ఎంఈఓ చంద్రప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, డాక్టర్ మానస, సీహెచ్ఓ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికి పౌష్టికాహారం

మోమిన్‌పేట: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని బూర్గుపల్లి, కాస్లబాదు గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. ప్రాథమిక పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు.